# చెట్లు ఎండాయి - నోట్లు పండాయి

"కార్యాలయ నిర్వహణ విభాగము : కార్యదర్శిగార్కి నోటు.

మన ఆఫీసు ఆవరణలో ఉన్న తోటల సక్రమ అభివృద్ధికోసం ఒక తోటమాలిని గతంలో నియమించిన సంగతి ఇప్పుడు గుర్తుకు తేవటం జరుగుతోంది. సదరు తోటమాలి శ్రీ రాజయ్య అనునాతడు నోటిమాటల పూర్వకంగా తెలియజేసిన దాని సారాంశము - 'అయ్యా! మన ఆఫీసు ఆవరణలో ఉన్న అనేక అసంఖ్యాకమైన చెట్లలో మూడు చెట్లు ఎండకు ఎండిపోవటం వల్ల మోడయినవి. ఆ మూడు చెట్ల వివరం : ఒక గానుగచెట్టు, ఒక తుమ్మచెట్టు, ఒక చిన్న వేపచెట్టు. ఆ చెట్లు ఎండిపోవటంవల్ల ఆఫీసు తోటలు అందవిహీనంగా తయారైనాయి. కాన ఆ చెట్ల విషయమై ఏదో నిర్ణయము తీసుకొనుట అత్యవసరం.

శ్రీ రాజయ్య నోటిమాటల పూర్వకంగా చెప్పిన విషయాల్ని గమనించాలని విన్నపం. సదరు శ్రీ రాజయ్య మన ఆఫీసులో తోటమాలిగా ఉన్న విషయం ఇంతకు పూర్వమే చెప్పబడింది. తోటమాలి ఉన్నా చెట్లు ఎండిపోవటం ఎలా జరిగింది అనే విషయం మీద శ్రీ రాజయ్య సంజాయిషీ కోరుట యుక్తము.

ఈ విషయమై తగిన ఆజ్ఞలకై ఫైలు సమర్పించడమైనది.

"అ.స్థా.గు.చే(వ్రాలు, 1.1.1978."

"ఆజ్ఞకోసం కార్యదర్శికి ఫైలు పంపబడుతోంది.

విభాగ నిర్వహణాధికారి, 5.1.1978".

"చూడబడింది.

కార్యదర్శి సంతకం 12.1.78".

"కార్యదర్శిగారి సముఖానికి : సదరు తోటమాలి సంజాయిషీ కోరటానికి ఖచ్చితమైన అనుజ్ఞ కోరబడుతోంది.

విభాగ నిర్వహణాధికారి, 21.1.78".

"కార్యాలయ నిర్వహణ విభాగం సమర్పించిన నోటు పరిశీలించి ఏం చేస్తే బాగుంటుందో సలహా ఇవ్వవలసిందిగా సాంకేతిక విభాగాధికారికి ఫైలు పంపడం మంచిది. కార్యదర్శి సంతకం. 26.1.78".

❖ ❖ ❖

"సాంకేతిక విభాగం నోటు :

కార్యాలయ నిర్వహణ విభాగం కార్యదర్శికి సమర్పించిన నోటును ఆమూలాగ్రం పరిశీలించాక సాంకేతిక విభాగం ఈ క్రింది సలహాలు అందజేస్తోంది.

1. మొట్టమొదట తోటమాలి శ్రీ రాజయ్య ఏ విషయాన్నయినా కార్యాలయ

నిర్వహణాధికారి దృష్టికి తేదల్చుకున్నప్పుడు దాన్ని నోటి మాటలతోకాక, అక్షరరూపంలో పెట్టి ఇవ్వటం తప్పనిసరి. ఇలా అక్షర రూపంలో ఉంటే భవిష్యత్‌లో సదరు తోటమాలి తానా సంగతి చెప్పలేదనే అవకాశం అతనికి లభించదు. పైగా అక్షర రూపంలో ఉంటే దాన్ని ఎవరూ కొట్టివేయటం జరగదు.

2. అయినా శ్రీ రాజయ్య చెప్పిన దాన్ని పరిశీలించాలని కార్యదర్శిగారు ఆజ్ఞాపించటంవల్ల అతను చెప్పినదాన్ని సత్యంగా భావించి పరిశీలించటం జరిగింది. తోటల సక్రమ అభివృద్ధికోసం ఒక తోటమాలిని నియమించేటప్పుడు తోటలో ఉన్న చెట్లసంఖ్యను ఎంతో గమనించటం జరిగిందా అనే విషయం తేల్చుకోవాలి. శ్రీ రాజయ్య నియామకం జరిగిన నాటినుంచి ఈ రోజువరకు చెట్ల సంఖ్యలో కేవలం మూడు చెట్లు మాత్రమే మోడైనాయా అనేది తర్వాత తేల్చుకోవాలి.

3. అసలు ఇలా ఆఫీసు ఆవరణలో ఉన్న చెట్లు మోడయి పోవటానికి కారణం ఏమిటో ఆరా తీయించాలి. చెట్లు మోడై పోవటానికి కారణాలు మూడు అయి ఉండొచ్చు.

అ) నీటి సరఫరా సక్రమంగా ఉండకపోవటం మొదటి కారణం.

ఇ) తోటమాలి నిర్లక్ష్యధోరణి.

ఉ) ఇతర కారణాలు.

ఒకవేళ ప్రస్తుతం పరిశీలనలో ఉన్న కేసుకు (అ) కారణమైతే, నీరు ఎందుకు సక్రమంగా సరఫరా కాలేదో విచారించటం అవసరం. పనిలో పనిగా మన ఆఫీసు మొత్తం నీటికోసం ఎంత ధనం వెచ్చిస్తోందో, ఆ వెచ్చిస్తున్న ధనంలో ఎంత నీరు సక్రమంగా చెట్లకోసమే వినియోగపడుతుందో, ఎంత భాగం అనవసరంగా నేలపాలవుతుందో లెక్కగట్టటం అవసరం. ఈ లెక్కలను పరిశీలించిన తర్వాత భవిష్యత్‌లో నీటి సక్రమ వినియోగంకోసం చర్యలు తీసుకోవడం మంచిది. ఈ చర్యలవల్ల మనకు మహాగణకులవారి అభ్యంతరాలు ఉండవు.

(అ) కారణం కాక (ఇ) కారణం అయితే, తోటమాలి నిర్లక్ష్య ధోరణిని అరికట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. కానీ కారణం అదేనని తేల్చుకోవలసిన అవసరం ఉంది. ఏమైనా తోటమాలిమీద నిఘా కోసం ఒక ప్రత్యేక వ్యక్తిని నియమించటం సబబేమో ఆలోచించటం మంచిది. దీనివల్ల అదనపు ఖర్చు ఉంటుందన్నది నిజమే కానీ, ఆఫీసు పనివారలలో క్రమశిక్షణ కోసం ఇలాంటి ఖర్చు పెట్టటం సబబే. దీన్ని కూడా మనం తోటఖర్చులలో కలిపివేయవచ్చు.

పై రెండూ కారణాలు కాక (ఉ) కారణం అయితే, ఆ కారణాలు ఏమిటో మనం ఆలోచిస్తే తప్ప, ప్రతిక్రియల గురించి ఆలోచించటం జరగని పని.

4. మిగతా ఆఫీసులలోని తోటలలో చెట్లు మోడయినప్పుడు ఆయా ఆఫీసులు ఏం చేస్తున్నాయో తెలుసుకోవటం అవసరం. ఈలోగా వంటచెరుకుగా ఆ చెట్ల మోడులను "ఉన్నది ఉన్నట్లు" స్థితిలో అమ్మేందుకు టెండర్ల కొటేషన్లు పిలవటం జరగాలి. అయితే

మామూలుగా కాక, కొటేషన్లలో అతి తక్కువది కాక అతి ఎక్కువది అంగీకరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పబడుతోంది.

5. ఏది ఏమైనా తోటమాలి వద్ద లిఖిత పూర్వకమైన సంజాయిషీ పొందటం మాత్రం ప్రథమ కర్తవ్యం.

కార్యదర్శి వారికి సమర్పితం.

సాంకేతిక విభాగాధికారి సంతకం. 7, ఏప్రిల్ 1978.

తాజాకలం : ఈ విషయమై జరుగుతున్న పరిశీలనకు నాంది పలికిన అ.స్థా.గు. వారి నోటు మీద జనవరి 1, 1978 అని సంతకం వుంది. జనవరి 1, 1978 ఆదివారం. పైగా జనవరి ఒకటి మామూలుగా తనకు సెలవుదినం. అ.స్థా.గు. దీన్ని గమనించటం అవసరం. భవిష్యత్తులో సరైనతేదీ వివరాలు ఇవ్వటం మర్చిపోకుండా అతన్ని మౌఖికంగా మందలించటం జరిగితే చాలు. అలాగే మరోచోట జనవరి 26, 1978 అని సంతకం కింద తేదీ గుర్తించబడి ఉంది. జనవరి 26రిపబ్లిక్ డే. సెలవుదినం కనుక ఆ తేదీని 27గా కానీ 25గా కానీ గమనించటం అవసరం.

సాం.వి.అ.సం. 7, ఏప్రిల్ 1978".

❖ ❖ ❖

"సాంకేతిక విభాగం వారి పరిశీలనలను, సలహాలను దృష్టిలో ఉంచుకొని కార్యదర్శిగారు ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నారు.

1. తోటమాలి శ్రీ రాజయ్య సంజాయిషీ వెంటనే కోరాలి. సంజాయిషీని అతడు సమర్పించాక దానిపై తగిన చర్య తీసుకోవచ్చు. ఈలోగా అతన్ని ఉద్యోగంలోంచి తొలగించటం తాత్కాలికంగా జరగాలి.

2. వెంటనే వృక్ష సంఖ్యలను నమోదు చేయించాలి. ఏదైనా విభాగాధికారి స్థాయికి తక్కువకాని స్థాయిలోవుండే అధికారి దీన్ని స్వయంగా జరపటం మంచిది. కార్యాలయ నిర్వహణాధికారి వెంటనే ఆఫీసు ఆవరణలోని చెట్లసంఖ్యను ఒక రిజిష్టరులో నమోదు చేయించటం జరగాలి.

3. మిగతా ఆఫీసులలో ఏం చేస్తున్నారో తెలుసుకోవటం వెంటనే జరిగే పనికాదు కనుక, టెండర్ల కొటేషన్ల కోసం మరింత ఖర్చుపెట్టటం కూడా వెంటనే ఆర్థిక పరిస్థితులవల్ల వీలుకాదు. కనుక, ఆ మూడు చెట్లనూ కొట్టించి, కలపను జాగ్రత్తగా దాచడం జరగాలి.

4. ఈ విషయమై జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్ని కార్యదర్శికి వారానికి ఒక నివేదిక పంపటం జరగాలి.

కార్యదర్శివారి ఆజ్ఞలను అనుసరించి, వారి వ్యక్తిగత సహాయకుడు, సంతకం. తా: మే 2, 1978.

తాజాకలం : 1. ఇకపై తారీకుల విషయంలో జాగ్రత్తపడాల్సిందిగా అ.స్థా.గు.కు హెచ్చరిక ఇవ్వటం జరుగుతోంది.

2. ఈ విషయమై మరింత స్థూలంగా, కూలంకషంగా పరిశీలన జరిపేందుకు కార్యదర్శివారు వచ్చే నెల తొమ్మిదో తేదీన తోటను దర్శిస్తున్నారు. ఈ ఆకస్మిక తనిఖీ విషయమై అన్ని విభాగాలు తగిన జాగ్రత్తలు తీసుకోవటం అవసరం.

కా.అ.అ.వారి వ్య.స.సం., మే 2, 1979".

❖ ❖ ❖

"కార్యాలయ నిర్వహణ విభాగం నోటు :

కార్యదర్శిగారి ఆజ్ఞలను దయచేసి పరిశీలించవలసింది.

1. తారీకుల విషయమై కార్యదర్శిగారి వ్యాఖ్యానానికి సంజాయిషీ. జనవరి ఒకటి సెలవురోజు అయినా, ఆ రోజున అ.స్థా.గు. అయిన నేను పనిచేయటం జరిగింది. కనుక ఆ తారీకు సక్రమంగా ఉందని విన్నవించుకొంటున్నాను.

2. తోటమాలి శ్రీ రాజయ్యను తొలగించే విషయం- అతన్ని తొలగించినట్లయితే ప్రస్తుతం ఉన్న చెట్లు సైతం పాడయ్యే ప్రమాదం ఉంది కనుక, ఈ విషయమై పునః పరిశీలన అవసరం అని తోస్తోంది. అయినా కార్యదర్శివారి ఆజ్ఞప్రకారం తోటమాలి శ్రీ రాజయ్యను సంజాయిషీ కోరుతూ, ఆ సంజాయిషీపై విచారణ జరిగి నిర్ణయం తీసుకొనేంత వరకు తాత్కాలికంగా అతన్ని తొలగించే ఉత్తర్వుల ముసాయిదా ఇందుతో జతపర్చబడింది. కార్యదర్శి వారు ఆ ముసాయిదాను ఆమోదించటం కానీ తిరస్కరించటం కానీ చెయ్యవలసిందిగా ప్రార్థితులు.

3. మూడు చెట్లనూ కొట్టించే విషయం - తోటమాలి సదరు శ్రీ రాజయ్యతో ఈ విషయం ప్రస్తావించటం జరిగింది. ఎండిపోయిన చెట్లు మరీ చిన్నవిగా ఉండటంవల్ల, బాగా ఎండిపోయినవి కావటంవల్లా, ఆ చెట్ల కొమ్మలు ఎప్పటికప్పుడు కింద పడిపోవటం జరిగిందనీ, కింద పడిపోయిన ఎండు కొమ్మల్ని ఆఫీసులో ఉంచటం భావ్యం కాదనే ఉద్దేశ్యంతో సదరు తోటమాలి చెట్ల మీదనుండి రాలిపోయే ఆకులతో కలిపి పారవేశాడని తెలుస్తోంది. కనుక ఇక ఆ చెట్లను కొట్టించే ప్రసక్తి బహుశా ఉండకపోవచ్చు. అయినా కొటేషన్లు ఇవ్వటానికి కానీ, చెట్లను కొట్టించి కలప దాచే విషయంలో కానీ కార్యదర్శి వారు ఖచ్చితమైన ఆజ్ఞలు ఇవ్వాలని కోరుతున్నాము.

4. మూడు చెట్లూ పడిపోయినందువల్ల కార్యదర్శి వారు తొమ్మిదో తేదీన తోటను దర్శించి పెద్ద ప్రయోజనం ఉండకపోవచ్చు. ఆకస్మిక తనిఖీవల్ల ఆశించిన ప్రయోజనం లభించనపుడు ఆ శ్రమ తీసుకోవటం వృధా అవుతుందని తెలియజేస్తున్నాం. అయినా కార్యదర్శివారి మననం కోసం తోటలో ఉండే చెట్లు (ఆకులు ఉన్నవి, ఎండిపోనివి, ఎండిపోయి పడిపోనివి అన్నీ కలిపి) వివరాలు ఇలా ఉన్నాయి: ఈ వివరాలు ఈనాటివే.

క్రోటన్ మొక్కలు : మొత్తం రెండువందల యాభై నాలుగు.

అలంకరణ మొక్కలు : రకరకాలు - మొత్తం నూట నలభై ఎనిమిది.

పూలు పూయని తీగజాతి వృక్షాలు: ఆర్చిలపై ఉన్నవి ఆరు.

కనకాంబరపు పొదలు : ఇరవై నాలుగు. చెట్ల వివరాలు స్పష్టంగా తెలీదు.

గులాబీ మొక్కలు : రంగు రంగులవి అన్నీ కలిపి ఆరువందల ముప్పై.

డిసెంబర్ చెట్లు : ఇరవై ఒకటి.

మొత్తం చెట్లు, మొక్కలు, వృక్షాలు, పొదలు: ఒక వెయ్యీ అరవై తొమ్మిది మాత్రమే.

అయితే ఇవికాక గరిక వృక్షాలు వేల సంఖ్యలో లెక్కకు మించి ఉన్నాయి.

ఈ రోజు ఉన్న వృక్షాల సంఖ్య స్పష్టంగా తెలుసు కనుక, రాజయ్య నిర్లక్ష్యవైఖరిని మనం గమనించాలంటే ఆకస్మిక తనిఖీ మరో ఆరు నెలల తర్వాత జరిపితే మంచిది. ఈ విషయమై కార్యదర్శి వారి నిర్ణయం వీలునిబట్టి తెలియజేయవలసిందిగా పరిపాలనా విభాగం వారిని కోరుతూ నేరుగా నోటు పెట్టబడుతోంది.

5. వెయ్యికి పైగా చెట్లు, వృక్షాలు, లతలూ, తీగలూ వగైరాలు ఉన్న కారణంగా ఒక్క తోటమాలిని మాత్రమే నియోగించడంవల్ల పని కుంటుబడుతోందని మోడయిన చెట్లు సాక్ష్యం చెబుతున్నాయి. కనుక మరో తోటమాలి నియామకానికి తగిన అంచనాలు - నియామకం జరిగే నాటికి పెరిగే తోట వైశాల్యం, పెరిగే చెట్ల సంఖ్య అన్నిటినీ సరిగ్గా అంచనా వేస్తూ ఇందుమూలంగా జతపర్చబడినవి. కార్యదర్శి వారు ఆమోదిస్తే ఈ అంచనాలు పంపించటం జరుగుతుంది.

6. తోట సంరక్షణకు సరిగ్గా కాలాన్ని వెచ్చించేందుకు తోటమాలికి తగినంత సమయం ఉండే అవకాశం ప్రస్తుత పరిస్థితిలో లేదు కనుక, తోటమాలిని సైతం తోటలోనే నివసింప చేసేందుకు వీలుగా ఉండేలా ఒక చిన్న ఇంటిని తోటలో కట్టమని భవనాల నిర్మాణశాఖను కోరటం అవసరం. ఈ విషయమై కార్యదర్శి అనుమతి కోసం ముసాయిదా లేఖ సమర్పించటం జరుగుతోంది. దీన్ని కార్యదర్శివారు ఆమోదించగలరు.

7. తోటమాలి శ్రీ రాజయ్య చెప్పినదాన్ని బట్టి మన తోటలో రాలుతున్న ఆకుల బెడద అధికంగా ఉందని స్పష్టమవుతోంది. ఈ బెడద ఎలా తప్పించుకోవచ్చో సాంకేతిక విభాగంవారి సలహాలు కోరటం వేరుగా జరపటం మంచిదేమో అన్న విషయంపై కార్యదర్శి వారి ఆజ్ఞలు కోరటం జరుగుతోంది.

సమర్పితం. అ.స్థా.గు. చే(వ్రా)లు. సెప్టెంబర్ 18, 1978".

"కార్యదర్శి వారికి పంపబడింది. విభాగాధికారి, సెప్టెంబర్ 20, 1978".

❖ ❖ ❖

"చూడబడింది.

నా ప్రశ్నలకు జవాబులు కానీ, నా వ్యాఖ్యలపై తీసుకొన్న చర్యలు కానీ నాకు వెంటనే తెలియాల్సి ఉందని నేను వేరుగా చెప్పనక్కర్లేదు.

మే 2, 1978 నాటి నా పరిశీలనలకు 20 సెప్టెంబర్, 1978 నాడు జవాబు ఇవ్వటానికి కారకులయిన వారి నుంచి సంజాయిషీ పొందండి. ఈ విషయంలో ఎవరెవరు బాధ్యులో వారి పేర్లను నాకు వ్యక్తిగతంగా తెలియజేయండి. వారిపై ఏ చర్య తీసుకోవాలో అప్పుడు నిర్ణయించవచ్చు.

ఇకపై ఇలాటి జాప్యాలు నేను సహించను. ఇలాటి జాప్యంవల్లనే ప్రభుత్వ కార్యాలయాల పట్ల ప్రజలకు సరైన మంచి అభిప్రాయం లేదు. ఈ విషయమై నా క్రింది ఉద్యోగులు జాగ్రత్తపడతారని ఆశిస్తాను.

కార్యదర్శి సంతకం. నవంబర్ 3, 1978".

తా.క : కార్యాలయంలో ఏ పనీ కార్యదర్శి అనుమతి లేనిదే జరగరాదు కనుక, పడిపోయిన చెట్లు శ్రీ కార్యదర్శివారి అనుమతితోనే పడిపోయినట్లుగా గమనించటం మంచిది. ఇకపై కార్యదర్శివారి ముందు అనుమతిలేనిదే ఏ చెట్టూ పడిపోయే వీలులేదని వేరుగా నోటీసు జారీచేయబడుతుంది. ఈ నోటీసును మరీ స్పష్టంగా అందరూ గుర్తించే లాగున ప్రాముఖ్యత ఉండే ప్రదేశాల్లో ప్రదర్శించాల్సిన బాధ్యత కార్యాలయ నిర్వహణ విభాగంపై ఉంటుంది. ఈ ఫైలు ఇంతటితో ముగింపబడ్డట్లు గుర్తించాలి.

పోతే కార్యదర్శివారు కోరిన సంజాయిషీల విషయమై వెంటనే వేరొక ఫైలును తెరువవలసిందిగా ఆజ్ఞలు జారీ చేయటం జరుగుతోంది.

కార్యదర్శి తరఫున - వారి వ్యక్తిగత సహాయకుడు, డిసెంబర్ 25, 1978".

- విజయ,